# బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 16 ఆగస్టు 2024 www.balagamtv.com పేజీలు 4


## కూలీల ఆటోను ఢీకొన్న లారీ.. ఇద్దరు మృతి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కూలీల ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతి చెందగా పలువురికి గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఉండవెల్లి ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా తాండ్రపాడుకు చెందిన కూలీలు ఆటోలో డ్రైవర్ 17 మంది కూలీలతో మహబూబ్‌నగర్ జిల్లా ఉండవెల్లి మండలం కంచుపాడు గ్రామ శివారులోని మిరప పంటలో కలుపు పనులకు వస్తుండగా 44 నెంబర్ జాతీయ రహదారిపై వరసిద్ధి వినాయక పత్తి మిల్లు సమీపంలో కర్నూలు నుంచి హైదరాబాద్ వైపు ముందుగా వెళ్తున్న ఆటోను లారీ వెనుకాల నుండి లారీ ఢీకొంది.

దీంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న బెస్త లక్ష్మీదేవి (56) తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలైన రమాదేవిని హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి రమాదేవి (40) మృతి చెందినట్లు తెలిపారు. ఆటో డ్రైవర్ నరసింహులు, అనితకు తీవ్ర గాయాలు కాగా మరో 13 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ప్రత్యక్ష సాక్షి నందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.





# రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకున్నాం

- ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చి చూపిస్తాం
- వైరా బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దేశచరిత్రలోనే తొలిసారి రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత తెలంగాణ ప్రజాప్రభుత్వానికే దక్కిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అన్నారు.

రూ.2లక్షల రుణమాఫీ కోసం మొత్తం రూ.31వేల కోట్లు వెచ్చిస్తున్నామని, తద్వారా వరంగల్ డిక్లరేషన్ లో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని చెప్పారు. 'సాగుకు జీవం.. రైతుకు ఊతం' పేరుతో ఖమ్మం జిల్లా వైరాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

ప్రజాప్రభుత్వం అజెండాలో వ్యవసాయరంగానికి ప్రాధాన్యత ఉందని, ఒకవైపు రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తూ, మరోవైపు రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను కూడా శరవేగంగా నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

"ఖమ్మం జిల్లాలో సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టును ఈరోజే జాతికి అంకితం చేసుకున్నాం. ఏడాది తిరిగేలోపే ఆ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది" అని ముఖ్యమంత్రి తెలిపారు.

అటు ప్రాజెక్టుల నిర్మాణం, ఇటు రుణమాఫీ ప్రక్రియతో తెలంగాణ రైతన్నల ఇంట పండుగ వాతావరణం నెలకొందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రుణమాఫీ ప్రక్రియలో సాంకేతిక కారణాలతో రైతులకు ఏవైనా ఇబ్బందులు వస్తే వ్యవసాయ శాఖ పరిష్కరిస్తుందని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ మాటిస్తే అది శిలాశాసనం లాంటిదని, ఆరు గ్యారంటీలతోపాటు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకొని తీరుతామని సీఎం స్పష్టం చేశారు.

ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ అసాధ్యం అని, ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తే పదవులకు రాజీనామాలు చేస్తామన్న ప్రతిపక్ష నేతలు ఇప్పటికైనా తప్పు తెలుసుకొని తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ముఖ్యమంత్రి అన్నారు. సాగుకు జీవం – రైతుకు ఊతం బహిరంగ సభలో ముఖ్యమంత్రి తోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు, మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు గారు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి , పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పలువురు ఎంపీలు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు..గత నెల 18న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించారు. మొదటి విడతలో లక్షలోపు రుణాలు, రెండో విడతలో లక్షన్నర వరకు రుణాలకు నిధులు విడుదల చేశారు. ఆగస్టు 15న ఖమ్మం జిల్లా వైరాలో నిర్వహించిన కార్యక్రమంలో చివరి దఫాగా రూ.రెండు లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేస్తూ నిధులు విడుదల చేశారు. కేవలం 27 రోజుల్లోనే మూడు విడతలుగా మొత్తం రూ.17,934 కోట్ల నగదును బ్యాంకులకు చెల్లించి 22,37,848 మంది రైతులను రుణవిముక్తి చేశారు. అయితే, ప్రభుత్వం నిర్ణయించిన కటాఫ్ డేట్ వరకు రూ.రెండు లక్షల వరకు వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మందికి పైగా ఉన్నా కొన్ని సాంకేతిక కారణాలతో సుమారు పది లక్షల మంది రైతులకు రుణమాఫీ అమలుకాలేదు. సమస్యలను సరిచేసి అర్హత కలిగిన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మూడో విడత రుణమాఫీ నిధుల విడుదల సందర్భంగా గురువారం ఖమ్మం జిల్లా వైరాలో "సాగుకు జీవం రైతుకు ఊతం" పేరుతో నిర్వహించిన బహిరంగ సభకు సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే నిలబెట్టుకున్నామన్నారు. ఏకకాలంలో ఇంత పెద్దమొత్తంలో బ్యాంకులకు జమ చేయడం దేశ చరిత్రలోనే తొలిసారని రేవంత్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ నాయకులు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్న హరీశ్ రావు%ొ% ఇప్పుడు ముక్కు నేలకు రాసి రైతులకు క్షమాపణ చెప్పాలని సిఎం డిమాండ్ చేశారు. 2026 పంద్రాగస్టులోగా సీతారామ ప్రాజెక్టు పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. తెలంగాణ ప్రజలు బిజెపికి ఎనిమిది ఎంపిసీట్లు ఇస్తే కేంద్ర బడ్జెట్‌లో వారు తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చారని విమర్శించారు. తెలంగాణలో బిజెపి జాగాలేదని స్పష్టంచేశారు. నియోజకవర్గానికి 3500 ఇళ్లు చొప్పున ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అంతకుముందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పూసుగూడెం వద్ద సీతారామ ప్రాజెక్టు రెండో పంప్‌హౌస్‌ను సిఎం ప్రారంభించారు.

## సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రజలకు అంకితం

**ప్రతిష్టాత్మక సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు అంకితం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీతారామ ఎత్తిపోత పథకం పంప్ హౌజ్-2 ను ముఖ్యమంత్రి స్విచ్ ఆన్ చేసి, రాజీవ్ కెనాల్ లోకి నీళ్లు వదిలారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు**



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు అన్నింటినీ త్వరితగతిన పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రతిష్టాత్మక సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టును సీఎం ప్రజలకు అంకితం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెంలో సీతారామ ప్రాజెక్టు రెండో పంప్ హౌజ్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం సీతారామ ప్రాజెక్టు పైలాన్ ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లాలో సీతారామ ఎత్తిపోతల సహా ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంతో ఇతర జిల్లాల నుంచి కూడా ప్రాజెక్టుల పూర్తికి ఒత్తిడి పెరిగిందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తెలిపారు. అన్ని జిల్లాల్లోని రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో వేగంగా పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



# త్వరలోనే స్టేషన్ ఘన్‌పూర్‌కు ఉప ఎన్నిక



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

త్వరలోనే స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఉపఎన్నిక వస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జోస్యం చెప్పారు. ఈ ఉపఎన్నికలో బిఆర్ఎస్ నుంచి రాజయ్య గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. హైకోర్టులో తీర్పు సానుకూలంగా వస్తుందని ఆశిస్తున్నామని అన్నారు. మిగతా వాళ్లపై నేరుగా సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు ఆలోచిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి పలువురు కాంగ్రెస్ నేతలు కెటిఆర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. కెటిఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎంఎల్ఎ రాజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ, సభాపతి రాజకీయ పక్షపాతం చూపిస్తూ ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడం లేదని పేర్కొన్నారు.

ప్రస్తుతం దేశంలో వరుసగా మూడోసారి అధికారంలోకి రావడం కష్టంగా ఉందన్నారు. 14 సీట్ల స్వల్ప తేడాతో కోల్పోయామని చెప్పారు. అందులో సగం గెలిచినా కథ వేరేలా ఉండేదని పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికలు రెండు కూటముల మధ్య నడిచిందని చెప్పారు. స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలు, తాము వేరే రకంగా మోసపోయామని వివరించారు. కెసిఆర్ ఉన్నప్పుడు కరెంటు పోతే వార్త, రేవంత్ రెడ్డి వచ్చాక కరెంటు ఉంటే వార్త అని ఎద్దేవా చేశారు. మొదటి ఏడాది రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి రెండు ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. రెండు లక్షల ఉద్యోగాల మాట బోగస్ అని యువతకు అర్థం అయిందన్నారు. మైసూర్ బజ్జీలో మైసూర్ ఎంత వాస్తవమో, జాబ్ క్యాలెండర్‌లో జాబ్‌లు అంతే అని ఎద్దేవా చేశారు.

త్వరలోనే కెసిఆర్ పార్టీ కార్యక్రమాలు ఇస్తారని కెటిఆర్ చెప్పారు. కొద్ది రోజుల్లో నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తారన్నారు. కెసిఆర్ పూర్తి చేసిన సీతారామ ప్రాజెక్టుకు సిఎం రేవంత్ రెడ్డి వెళ్లి రిబ్బన్ కట్ చేశారని ఎద్దేవా చేశారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క చెప్పినట్లు రూ.75 కోట్లతో 1.25 లక్షల ఎకరాలకు నీరు ఇచ్చే మాట వాస్తవం అయితే ఇక నుంచి అన్ని ప్రాజెక్టులకు అలాగే చేయాలని కోరారు. పిఆర్ స్టంట్లు, నాటకాలతో ప్రజలను ఎక్కువ రోజులు మోసం చేయలేరని హితవు పలికారు.స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అని బిసి డిక్లరేషన్‌లో చెప్పారు. బిసిలకు మోసం చేసి రిజర్వేషన్లు పెంచకుండానే రేవంత్ రెడ్డి స్థానిక ఎన్నికలు పెడతారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ నేతలు ప్రజల్లో తిరగలేని పరిస్థితి ఉంటుంది.

అడ్డగోలు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వీళ్ల అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే కరెంటు మాయమైందని అన్నారు. ఇప్పుడు ఒక రోజులో ఎన్నిసార్లు కరెంటు పోతుందో లెక్క పెట్టడం కూడా ప్రజలు మానేశారని తెలిపారు. కేసీఆర్ ఉన్నప్పుడు కరెంటు పోతే వార్త.. రేవంత్ రెడ్డి వచ్చినంక కరెంటు ఉంటే వార్త అన్నట్లు తయారైందని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో మళ్లీ మోటార్లు కాలడం, ట్రాన్స్‌ఫార్మర్లు పేలడం మొదలైందని విమర్శించారు.

కరెంటు పోతుందని డిస్కమ్ అధికారులకు సోషల్‌మీడియాలో ఫిర్యాదుచేస్తే.. ట్రాన్స్‌ఫార్మర్ల మీద తొండ పడ్డది.. ఇంకో ట్రాన్స్‌ఫార్మర్ మీద ఉడత పడ్డదని జవాబు ఇస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. మనం పరిపాలించినప్పుడు తొండలు, ఉడతలు లేవా? ఇప్పుడే కొత్తగా వస్తున్నాయా? అని ఎద్దేవా చేశారు. ఊసరవెల్లులు రాజ్యం నడిపితే తొండలు, ఉడతలే వస్తాయని సెటైర్ వేశారు. వాళ్లు మాట్లాడే మాటలు విచిత్రంగా ఉన్నాయని అన్నారు.

ఏదైనా చెడు జరిగితే కేసీఆర్ మీదకు నూకాలి.. మంచి జరిగితే మన ఖాతాలో వేసుకోవాలి అన్నట్లుగా కాంగ్రెస్ నాయకుల తీరు ఉందని కేటీఆర్ విమర్శించారు. 30వేల ఉద్యోగాలు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి అంటు న్నాడని అన్నారు. ఉద్యోగం ఇవ్వాలంటే నోటిఫికేషన్ ఇవ్వాలి.. పరీక్ష పెట్టాలి.. ఆ తర్వాత ఇంటర్వ్యూ నిర్వహించాలి.. ఈ మూడు అయిన తర్వాతనే ఉద్యోగం ఇస్తారని అన్నారు. కానీ రేవంత్ రెడ్డి పరిపాలనలో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలే.. ఒక్క పరీక్ష పెట్టలే.. ఒక్క ఇంటర్వ్యూ చేయలే.. కానీ 30వేల ఉద్యోగాలు ఇచ్చినా అని ఊదరగొడుతున్నారని విమర్శించారు. లగ్గం కాలే.. సంసారం చేయలే.. కానీ పిల్లలు పుట్టింద్రు అని అంటున్నా డని.. దీన్ని ఎట్ల నమ్మాలని ప్రశ్నించారు. ఈ మాట అడిగితే.. పరీక్షలు మీరే పెట్టొచ్చు.. కానీ చిక్కుముళ్లు విప్పి ఉద్యోగాలిస్తే తప్పంటారా? అని ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఎంత ఇజ్జత్ తక్కువ మనుషులు అని విమర్శించారు.

ఈయన చెబితే నమ్మట్లేదని.. రాహుల్ గాంధీని అశోక్‌నగర్ తీసుకెళ్లి చెప్పిచ్చింద్రు అని కేటీఆర్ అన్నారు. అధికారంలోకి వచ్చినంక మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని అన్నారు. కనీసం రెండు ఉద్యోగాలు అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. ఇద్దరు నిరుద్యోగులు మాత్రం ఉద్యోగాలు సంపాదించింద్రు అని విమర్శించారు. రాహుల్‌గాంధీకి ఉద్యోగం లేకుండే.. ఆయన ఇప్పుడు ప్రతిపక్ష నాయకుడు అయ్యారని అన్నారు. రేవంత్ రెడ్డికి ఉద్యోగం లేకుండే.. ఆయన ముఖ్యమంత్రి అయ్యారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఉద్యోగం ఊడగొడితేనే మీకు ఉద్యోగాలు వస్తాయని నమ్మబలికాడని అన్నారు. ఏమైంది మరి ఉద్యోగాలు వచ్చాయా అని ప్రశ్నించారు. వీళ్ల మోసాలను తెలంగాణ యువత ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారని అన్నారు. కాంగ్రెసోళ్లు ఇంత మోసగాళ్లా?

ఇంత అన్యాయం చేస్తారా అని తెలంగాణ యువత మర్లబడుతుందని చెప్పారు. మొన్న అసెంబ్లీకి వచ్చింద్రు అని.. అశోక్‌నగర్‌లో లొల్లి అయ్యిందని.. దిల్‌సుఖ్‌నగర్‌లో లొల్లి అయ్యిందని.. రాష్ట్రమంతా లొల్లిలు అవుతున్నాయని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాల ముచ్చట బోగస్ అని తెలంగాణ యువతకు అర్థమైతుందని అన్నారు.

మిగిలింది మూడు నెలలే అని.. మూడు నెలల్లో రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడి నుంచి ఇవ్వాలే అని.. తెలంగాణ అసెంబ్లీలో కొత్త దందా మొదలు పెట్టారని విమర్శించారు. అందుకే జాబ్ క్యాలెండర్ అని ఒకటి ఇచ్చారని అన్నారు. మైసూర్ బజ్జీలో మైసూర్ ఉండటం ఎంత వాస్తవమో.. నేతిబీరకాయలో నెయ్యి ఉండటం ఎంత వాస్తవమో.. జాబ్ క్యాలెండర్‌లో జాబులు అంతే వాస్తవమని ఎద్దేవా చేశారు. అది జాబ్ క్యాలెండర్ కాదు.. జాబ్‌లెస్ క్యాలెండర్ అని విమర్శించారు.

## ఎర్రకోటపై జెండా ఎగరేసిన మోడీ



**దేశవ్యాప్తంగా 78వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఢిల్లీలో ఎర్రకోటపై మువ్వెన్నెల జెండాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎగరవేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు, ప్రతిపక్ష నేతలు, 6వేల మంది ప్రత్యేక అతిథుల సమక్షంలో జాతీయ జెండా సగర్వంగా రెపరెపలాడింది. ఈ క్రమంలో ఎర్రకోట వద్ద ప్రత్యేక హెలికాప్టర్ల ద్వారా పూల వర్షం కురిపించారు. 2047 వికసిత భారత్ థీమ్‌తో పంద్రాగస్టు వేడుకలు నిర్వహించారు. కాగా, 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ సరికొత్త రికార్డును క్రియేట్ చేశారు. ఏకధాటిగా 98 నిమిషాలు ప్రసంగించారు. స్వతంత్ర భారత చరిత్రలో ఏ ప్రధాని కూడా ఇంత సుధీర్ఘంగా ప్రసంగించలేదు.**

వివరాలు 3వ పేజీలో

## తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవేదికపై చాటాలి





- సీఎం రేవంత్ రెడ్డి
- జాతీయ జెండాను ఎగురవేసిన సీఎం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణను ప్రపంచానికి ముఖద్వారంగా మార్చాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవేదికపై సగర్వంగా చాటాలని సూచించారు. పెట్టుబడల సాధన కోసం అమెరికాలో పర్యటించామని స్పష్టం చేశారు. దిగ్గజ సంస్థల అధినేతలు, ప్రతినిధులతో భేటీ అయ్యామని చెప్పారు. ఫ్యూచర్ స్టేట్‌గా తెలంగాణను వారికి పరిచయం చేశామని సీఎం వెల్లడించారు. గోల్కొండ కోటలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని సీఎం రేవంత్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు.

'ముందుగా దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. మహానుభావుల త్యాగాలతో స్వాతంత్ర్య సాధించుకున్నాము. నెహ్రూ దార్శనికత ఫలితంగానే దేశం ఈస్థాయిలో ఉంది. నెహ్రూ ప్రారంభించిన ప్రాజెక్టులతోనే దేశం సస్యశ్యామలంగా ఉంది. బీహెచ్ఈఎల్, మిధాని వంటి పరిశ్రమలను నెహ్రూ స్థాపించారు. లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ సాగులో

మిగితా 3వ పేజీలో

## గాజాలో మృత్యుఘోష ఇజ్రాయెల్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

హమాస్ యుద్ధంలో మృతుల సంఖ్య 40,000 దాటిపోయింది. మృతదేహాలను ఖననం చేయడానికి కుటుంబ సభ్యులు నానా కష్టాలు పడుతున్నారు. గాజా స్ట్రిప్‌లోని డెయిర్ అల్-బలాహ్ శ్మశాన వాటికలో సూర్యోదయం నుంచి సమాధుల తవ్వకాలు ప్రారంభమవుతున్నాయి. గాజా స్ట్రిప్‌లోని డెయిర్ అల్-బలాహ్ శ్మశాన వాటికలో సూర్యోదయం నుంచి సమాధుల తవ్వకాలు ప్రారంభమవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న సమాధులను కూడా తెరచి, అంతస్థులుగా సమాధులను నిర్మిస్తున్నారు.

# రాష్ట్రాభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం..


- **జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల :**

రాష్ట్రంలో ప్రజా పాలన 2023 డిసెంబర్ 7వ తేదీ నుంచి కొనసాగుతోంది అని,ఇందులో భాగంగానే ప్రజలకు మెరుగైన పాలన అందిస్తూనే,సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాము అని,రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రభుత్వ దినోత్సవ వేడుకలు రాజన్న సిరిసిల్ల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై పోలీసులు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో జిల్లాలోని లీడ్ బ్యాంక్, వివిధ బ్యాంకుల ద్వారా 528 మహిళ సంఘాలకు చెందిన 5626 మందికి రూ 91 కోట్ల రుణాలు, 84 సంఘాలకు చెందిన 423 మంది మహిళలకు స్త్రీ నిధి ద్వారా రూ. 5.22 కోట్లు, మెప్మా ఆధ్వర్యంలో 80 మహిళా సంఘాలకు రూ. 10 కోట్ల రుణాలు మంజూరు కాగా, లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చెక్కులు అందజేశారు. వివిధ శాఖల ద్వారా ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను విప్, కలెక్టర్ అందజేశారు. కారుణ్య నియామకాల కింద కర్నె దేవేంద్ర, కంకణాల దేవ లత, అనీల్ కుమార్ కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.

భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విచ్చేసిన జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, పాత్రికేయులకు నా హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. సుదీర్ఘ పోరాటాలు, ఎందరో మహానుబావుల ప్రాణత్యాగాలతో బ్రిటిష్ సామ్రాజ్య పాలన అంతమై భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. పౌరులందరికీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం సిద్ధించాయ అని అన్నారు.



రైతు సంక్షేమమే ప్రథమ లక్ష్యంగా మన ప్రభుత్వం పని చేస్తుంది అని, గత ప్రభుత్వాలు అసాధ్యమని చెప్పిన రుణమాఫీ అంశాన్ని ప్రస్తుత ప్రజా ప్రభుత్వం సుసాధ్యం చేసింది అని అన్నారు.దేశంలో ఎన్నడూ జరగని రీతిలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేసి రాష్ట్ర ప్రభుత్వం చరిత్ర సృష్టించింది అని అన్నారు.. రైతులకు ఎకరానికి 15 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సహాయం అందించే రైతుభరోసా పథకాన్ని ప్రభుత్వం త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు.

. ప్రజాప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయహస్తం హామీలను అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచే ఒక్కొక్కటిగా అమలు చేయడం ప్రారంభించింది అని అన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహాలక్ష్మీ గ్యారెంటీ పథకం కింద మహిళలకు, ట్రాన్స్ జెండర్లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత బస్సు ప్రయాణ సాకర్యం కల్పించాం అని అన్నారు.రాష్ట్రంలోని పేదలకు, వెనుకబడిన వర్గాల ప్రజల గృహావసరాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించింది అని అన్నారు.వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి వీటీడీఏ కు 2024-25 బడ్జెట్లో 50 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది అని,దీంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని అన్నారు.

జిల్లాలోని 9,10,11 ప్యాకేజీల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. త్వరలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని అన్నారు.శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని రైతుల సాగు కష్టాలు దూరం చేసేందుకు రూ. 350 కోట్ల వ్యయంతో పనులు చేపట్టనున్నాము అని,ప్రతి చెరువు నింపి పంటల సాగుకు భరోసా కల్పిస్తాం అని అన్నారు.

సిరిసిల్లలోని నేతన్నలకు భరోసా కల్పించే చర్యలు తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుంది అని, సమగ్ర శిక్ష కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం క్లాత్ ఉత్పత్తి చేసే ఆర్డర్లను సిరిసిల్లలోని వస్త్ర పరిశ్రమకు అందజేశాం అని అన్నారు.

మహిళా సంఘాలతో పట్టణాలలో ప్రజా సంచారం అధికంగా ఉండే ప్రాంతాలలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలుచేపట్టిందని అన్నారు.

**యువతకు ఉపాధి అవకాశాలు:**

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తుంది అని అన్నారు.

జిల్లాలో చేయూత పెన్షన్ల క్రింద వృద్ధులు, వితంతువులు, నేత, గీత, బీడీ కార్మికులు, బీడీ టెకేదార్లు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, ఫైలేరియా బాధితులు మరియు ఒంటరి మహిళలకు జీవన భ్రుతి క్రింద నెలకు రూ. 2,016/- మరియు దివ్యాంగులకు నెలకు రూ.4,016/- అందిస్తుంది. జిల్లాలో 1 లక్ష 19 వేల 449 మంది పింఛను దారులకు ప్రతినెల రూ.26 కోట్లు పంపిణీ చేయడం జరుగుతుంది అని అన్నారు.

ప్రజలందరికీ సకాలంలో నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం యూనివర్సల్ పాలసీ రూపొందిస్తుంది అని అన్నారు.పేదలకు కార్పోరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచి అమలు చేస్తున్నామన్నారు .

మౌలిక వసతుల కల్పన బాధ్యతను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించింది అని,అమ్మ ఆదర్శ పాఠశాల కింద 283 పాఠశాలలను ఎంపిక చేసిత్రాగు నీరు, మేజర్, మైనర్ రిపేర్స్, టాయిలెట్ల మరమ్మతులు చేయించడం జరిగింది అని అన్నారు.గ్రామాల అభివృద్ధికి ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ చూపిన మార్గంలో ప్రతి గ్రామాన్ని స్వావలంబన దిశగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అని అన్నారు.

సొంత ఇండ్లు ఉండాలనేది ప్రతి సామాన్యుడి జీవిత ఆశయం. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రజా ప్రభుత్వం అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఎస్పీ అఖిల్ మహజన్, పలువురు ఉన్నత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ వ్యాఖ్యలపై మహిళా కమిషన్ సీరియస్

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల :**

మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం విషయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుంది. మహిళల పట్ల కేటీఆర్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు మహిళా కమిషన్ అభిప్రాయపడింది.

టీజీఎస్ఆర్టీసీ కేటీఆర్ వ్యాఖ్యలపై విచారణ జరపాలని తెలంగాణ మహిళా కమిషన్ ఆదేశించింది. కాగా, బస్సుల్లో అల్లం వెల్లుల్లి, కుట్లు అల్లికలు చేసుకుంటే తప్పేంటన్న మంత్రి సీతక్క వ్యాఖ్యలపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. బస్సుల్లో అల్లం వెల్లుల్లి, కుట్లు అల్లికలు తాము వద్దనట్లేదన్నారు కేటీఆర్. బస్సుల్లో కుట్లు అల్లికలే కాదు, అవసరమైతే బ్రేకు డ్యాన్సులు వేసుకోవచ్చని కేటీఆర్ అన్నారు. బస్సుల్లో సీట్లకోసం మహిళలు కొట్టుకుంటున్నారని, డ్రైవర్లు కండక్టర్లకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బస్సులు ఎక్కువ పెట్టండి, అవసరమైతే ఒక్కొక్కరికి ఒక్కో బస్సు పెట్టండంటూ కాంగ్రెస్ ప్రభుత్వంనుద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యనించారు. మరోవైపు, మంత్రి సీతక్క.. కేటీఆర్ వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు బ్రేక్ డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు చేసుకోవచ్చంటూ కేటీఆర్ జుగుప్సకరంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ తండ్రి ఆయనకు నేర్పిన సంస్కారం ఇదేనా? అంటూ ప్రశ్నించారు మంత్రి సీతక్క. కేటీఆర్‌కు మహిళలంటే గౌరవం లేదన్నారు. మహిళల పట్ల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని మంత్రి సీతక్క అన్నారు. వెంటనే తెలంగాణ మహిళా లోకానికి కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని సీతక్క డిమాండ్ చేశారు. మరోవైపు, కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఇతర కాంగ్రెస్ నేతలు కూడా మండిపడుతున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తమ ప్రభుత్వం అందిస్తుంటే.. బీఆర్ఎస్ ఓర్వలేకపోతోందంటూ మండిపడుతున్నారు.

## అంబర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

**బలగం టీవీ ,హైదరాబాద్**



హైదరాబాద్ అంబర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. ఓ పెయింట్స్ కంపెనీలోఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానిక ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఈ అగ్నిప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు హాస్పిటల్‌కు తరలించారు.

హైదరాబాద్ : అంబర్‌పేటలో(%ూాఎఎవతీజూవ%) భారీ అగ్నిప్రమాదం(%ఎబస్త్రవ టఱతీవ%) చోటు చేసుకుంది. భారీగా మంటలు ఎగిసిపడుతున్నాయి. ఓ పెయింట్స్ కంపెనీలో(, %ూఖఱఱ్ ఌశీఎజూఖఅఎ%) ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానిక ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఈ అగ్నిప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. కాగా, పెయింట్స్ కంపెనీ జనవాసాల మధ్య ఉండటంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. పోలీసులు కంపెనీ పరిసర ప్రజలను అక్కడ నుంచి తరలించారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎగిరిన మువ్వన్నెల జెండా....



**బలగం టీవీ , సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 78 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. సిరిసిల్ల పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్, తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు.









## తీజ్ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..



**బలగం టీవీ,సిరిసిల్ల :**

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తీజ్ వేడుకలో పాల్గొన్నారు. గిరిజనుల సంప్రదాయ వేడుక, గిరిజన యువతులు ఇష్టంగా జరుపుకొనే తీజ్ పండగ గురువారం కోనరావుపేట మండలం వట్టిమల్ల జై సేవాలాల్ రెడ్డి తండా,చందుర్తి మండలం దేవుని తండా లోఘనంగా జరిగింది. ఈ వేడుకలలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని యువతి యువకులతో కలిసి గిరిజన సాంప్రదాయ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గిరిజనుల సాంస్కృతిక వైభవానికి ప్రతీక తీజ్ పండగ అని మంత్రి తెలిపారు. యువతులు తమ కోరిక నెరవేరాలని 9 రోజుల పాటు గోధుమ విత్తనాలను నారుగా పెంచి, భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేసి కుటుంబంతో సరదాగా చేసుకునే పండగ ఇదన్నారు.వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో ప్రజలు సంతోషంగా ఉండాలని అన్నారు.

## మహిళా చట్టాలు అమలు చేసి రక్షణ కల్పించాలి




**బలగం టీవీ , సిరిసిల్ల:**

78వ స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం జిల్లా అధ్యక్షులు సూరం పద్మ లత, ప్రధాన కార్యదర్శి జవాజి విమల లు మాట్లాడుతూ మహిళలకు 33% కాకుండా 50% రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చి న నుండ మహిళలపై హింసలు,దాడులు అధికంగా పెరిగినాయని,మహిళలకు రక్షణ కరువైందని అన్నారు. ఎందరో మహిళలు స్వతంత్ర పోరాటంలో మరియు స్వతంత్ర ఉద్యమంలో ముందుండి పోరాటం చేశారని అన్నారు.78 సంవత్సరాలు గడిచిన ఇంకా మహిళా చట్టాలకు నోచుకోలేని పరిస్థితి ఉన్నదని, ఇప్పటికైనా మహిళా చట్టాల అమలు చేసి మహిళలకు రక్షణ కల్పించమని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లీశ్వరి,మజ్జుల,కొడం లత తదితరులు పాల్గొన్నారు

## వచ్చే నెలలో అమెరికాకు ప్రధాని

**బలగం టీవీ , హైదరాబాద్**

భారత ప్రధాని నరేంద్ర మోడీ సెప్టెంబర్‌లో అమెరికాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సెప్టెంబర్ 22వ తేదీన న్యూయార్క్ సమీపంలోని లాంగ్ ఐలాండ్‌లో జరిగే కమ్యూనిటీ మీట్‌లో ప్రసంగిస్తారని అధికారికంగా వెల్లడైంది. అమెరికాలో నవంబర్‌లో జరిగే దేశాధ్యక్ష ఎన్నికలకు ముందు భారత ప్రధాని అమెరికా పర్యటన ఖరారు అయింది. లాంగ్ ఐలాండ్‌లోని 16వేల సీట్ల సామర్థ్యపు నసావు కొలిషియంలో సభకు ఏర్పాట్లు జరుగుతాయి. 26వ తేదీన న్యూయార్క్‌లో జరిగే ఐరాస సర్వప్రతినిధి సభలో కూడా పాల్గొంటారు. వక్తల జాబితాలో మోడీ పేరు కూడా చేర్చారు. ఐలాండ్‌లో జరిగే భారతీయ సంతతి సమావేశంన్యూయార్క్‌లోనే పది సంవత్సరాల క్రితం ప్రఖ్యాత మెడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరిగిన భారీస్థాయి సమావేశం తరహా అంతకు మించిన స్థాయిలో ఉంటుంది. 2014 సెప్టెంబర్‌లో మెడిసన్ స్కేర్ కార్యక్రమం జరిగింది. ఆ తరువాత 2019లో మోడీ టెక్సాస్‌లోని హ్యూస్టన్‌లో జరిగిన హౌడీ మోడీ కార్యక్రమంలో పాల్గొన్నారు, ఇక సెప్టెంబర్ 24 నుంచి 30 వరకూ న్యూయార్క్‌లో 79వ ఐరాస జనరల్ అసెంబ్లీ జరుగుతుంది. ప్రస్తుత ప్రపంచ వ్యాప్త కీలక ఆందోళనకర పరిణామాల నేపథ్యంలో ఐరాసలో జరిగే ఉన్నత స్థాయి సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది.

## 14 వేల మంది చిన్నారులతో జాతీయ గీతాలాపన

**బలగం టీవీ , హైదరాబాద్**

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన భారతీయ సంగీత దర్శకుడు గ్రామీ విజేత రిక్కీ కేజ్, బ్రిటిష్ ఆర్కెస్ట్రా, 14 వేల మంది ఆదివాసీ చిన్నారులతో మన జాతీయ గీతాన్ని వైవిధ్యభరితంగా ఆలపించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈమేరకు వీడియోను రూపొందించారు. ఈ గీతాలాపన గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లో చోటు చేసుకుంది. ఈ వీడియోను రిక్కీ కేజ్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు. పండిట్ హరిప్రసాద్ చౌరాసియా, రాకేశ్ చైరాసియా, రాహుల్‌శర్మ, అమన్, అయాన్‌అలి బంగాశ్, జయంతి కుమరుశ్, షేక్ మహబూమ్, కలీషాబీ మహబాబ్, వంటి ప్రముఖ శాస్త్రీయ సంగీక విద్వాంసులు, తమ వాయిద్యాలతో జాతీయ గీతాన్ని ప్రత్యేకంగా పలికించారు. వీరితోపాటు బ్రిటన్ లోని రాయల్ ఫిల్‌హార్మోనిక్ ఆర్కెస్ట్రాకు చెందిన 100 మంది సభ్యుల బృందం కూడా ఈ గీతాలాపనలో పాల్గొంది. కలింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌కు చెందిన 14 వేల మంది ఆదివాసీ చిన్నారులు భారత దేశం చిత్రపటం ఆకృతిలో , భారత్ ఆంగ్ల, హిందీ అక్షర క్రమంలో నిల్చొని జారీయ గీతాన్ని ఆలపించారు.

# భారత్ ప్రస్థానం ప్రపంచానికే స్ఫూర్తిదాయకం

- ప్రధాని మోదీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారత దేశ ప్రస్థానం ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన జాతినుద్దేశించి ప్రసంగించారు. దేశ పౌరులకు ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత మాట్లాడుతూ.. హర్ ఘర్ తిరంగా వేడుకలు దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయన్నారు. దేశం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకుందామని పిలుపునిచ్చారు.



దేశం కోసం జీవితాలను పణంగా పెట్టిన మహనీయులు ఎందరో ఉన్నారని.. ప్రాణాలర్పించిన మహనీయులకు దేశం రుణపడి ఉందననారు. భారత్ ప్రస్థానం ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని.. శతాబ్దాల తరబడి దేశం బానిసత్వంలో మగ్గింద న్నారు. స్వాతంత్ర్యం కోసం ఆనాడు 40కోట్లమంది ప్రజలు పోరాడారని.. ఇప్పుడు దేశ జనాభా 140 కోట్లకు పెరిగిందని చెప్పారు. ఈ 140కోట్ల జనం కలలను సాకారం చేయాల్సి ఉందన్నారు. ఇందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలన్నారు. కొన్నేళ్లుగా విపత్తులు దేశాన్ని ఇబ్బందిపెట్టాయని.. విపత్తు బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలిపారు.

2047 నాటికి వికసిత భారత్ మనందరి లక్ష్యమని ప్రధాని తెలిపారు. భారత్‌ను ప్రపంచ నైపుణ్యాల రాజధానిగా మార్చాలని.. తయారీ రంగంలో గ్లోబల్ హబ్‌గా భారత్‌ని తీర్చిదిద్దాలన్నారు. ప్రపంచానికే అన్నంపెట్టే స్థాయికి భారత్ ఎదగాలని.. దేశాభివృద్ధికి పాలనా సంస్కరణలు అవసరమన్నారు. న్యాయవ్యవస్థలో సంస్కరణలు అవసరమని అభిప్రాయపడ్డారు. అంతరిక్షంలో భారత స్పేస్‌స్టేషన్ త్వరలో సాకారం కావాలన్నారు. మనం అనుకుంటే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని చెప్పారు. వికసిత భారత్ 2047 నినాదం 140కోట్ల మంది కలల తీర్మానమని.. దళితులు, పీడితులు, ఆదివాసీలు గౌరవంగా బతకాలన్నారు. వోకల్ ఫర్ లోకల్ అనేది ప్రభుత్వ వ్యూహమని.. వోకల్ ఫర్ లోకల్ నినాదం ఆర్థిక వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చిందని చెప్పారు.

సర్జికల్ స్ట్రయిక్స్‌ను దేశ ప్రజలు సగర్వంగా స్మరించుకుంటున్నారని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అభివృద్ధి బ్లూప్రింట్‌గా సంస్కరణలు తీసుకువస్తున్నామని.. నేషన్ ఫస్ట్.. రాష్ట్ర్ హిత్ సుప్రీం సంకల్పంతో ముందుకెళ్తున్నామన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఎన్నో సంస్కరణలు అమలు చేశామని తెలిపారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థ ప్రపంచంలోనే బలమైందని.. జల్‌జీవన్ మిషన్ ద్వారా 15కోట్ల మందికి లబ్ధి చేకూరిందన్నారు. భారత్ చిరుధాన్యాలు ప్రపంచంలోని అందరికీ చేరాలని.. భారీ సంస్కరణలు తెచ్చేందుకు ప్రభుత్వం సంకల్పం తీసుకుందన్నారు. దేశాభివృద్ధికి నూతన ఆర్థిక విధానాలు అమలు చేస్తున్నామని.. ఉపాధి కల్పనలో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. యువతకు నూతన ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

దేశంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల భద్రతకు భరోసా ఇవ్వాలన్నారు. ఈ ఘటనల్లో త్వరితగతిన విచారణ జరిపి నిందితుల్ని శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఖమ్మం పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. జాతీయ జెండాను ఎగురవేసి గౌరవవందన స్వీకరించారు. అనంతరం ప్రభుత్వ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి భట్టి విక్రమార్క ప్రసంగించారు. కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు జాతీయ జెండాను ఎగరవేశారు. స్వతంత్ర పోరాటంలో అసువులు బాపిన త్యాగధనుల్ని స్మరించుకున్నారు.

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్రంలో ప్రజా పాలన నడుస్తోందని పొన్నం వ్యాఖ్యానించారు. హనుమకొండ పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరించిన అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రభుత్వ ప్రాధాన్యతల్ని వివరించారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు.

'ధరణికి సంబంధించి సమీకృత భూమి రికార్డు నిర్వహణ వ్యవస్థలో భారంగా ధరణి పోర్టల్‌ను గత ప్రభుత్వం ప్రవేశపట్టింది. దీని వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను అర్థం చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం, ధరణి స్థానంలో అత్యుత్తమ చట్టం రూపకల్పనకు చర్యలు చేపట్టింది. నాలుగు గోడలు, నలుగురు మనుషుల మధ్య రూపకల్పన చేయకుండా ప్రజా ఆమోదం చట్టం కోసం మేధావుల సూచన మేరకు ఆగస్టు 2 నుంచి 23 వరకు వెబ్?పోర్టల్?లో ఉంచి సలహాలు, సూచనల ప్రకారం ఆదర్శమైన రెవెన్యూ చట్టాన్ని తీస్తాం'-భట్టి విక్రమార్క, ఉపముఖ్యమంత్రి

రైతు సంక్షేమానికి పెద్దపీట : సంగారెడ్డి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రసంగించిన దామోదర రాజనర్సింహ, ప్రజారోగ్యమే ధ్యేయంగా ముందుకెళు న్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఎగురవేసిన ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు.

ములుగులో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. జెండా ఆవిష్కరించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుల్ని సన్మానించారు. అనంతరం ములుగు జిల్లా ప్రగతిపై మంత్రి సీతక్క ప్రసంగించారు.

# హామీపై మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి



- మాజీ మంత్రి,
  బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రుణమాఫీ హామీపై మాట తప్పినందుకు సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ధ్వజమెత్తారు. తాను ముఖ్యమంత్రి స్థాయికి తగ్గట్టు ప్రవర్తించలేడనే విషయాన్ని ప్రతి సందర్భంలోనూ రేవంత్ రెడ్డి నిరూపించుకుంటున్నాడని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో గాని, తెలంగాణ చరిత్రలో గాని ఇంతగా దిగజారిన దిక్కుమాలిన ముఖ్యమంత్రి ఇంకెవరూ లేరని మండిపడ్డారు. అబద్ధం కూడా సిగ్గుపడి మూసీలో దూకి ఆత్మహత్య చేసుకునేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రవర్తన ఉందని అన్నారు. దేవుళ్ల మీద ఒట్లు పెట్టుకొని కూడా మాట మీద నిలబడక పోగా, నిస్సిగ్గుగా బీఆర్ఎస్‌పై, తనపై అవాకులు చెవాకులు పేలాడని హరీశ్‌రావు విమర్శించారు.

అసెంబ్లీ ఎన్నికలకు ముందు సోనియా గాంధీ పుట్టిన రోజు కానుకగా డిసెంబర్ 9 నాటికి రూ.40వేల కోట్లను రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తానని రేవంత్ రెడ్డే అన్నారని హరీశ్‌రావు గుర్తు చేశారు. అది నెరవేర్చలేక పార్లమెంట్ ఎన్నికల ముందు మరో నాటకానికి తెరలేపారని విమర్శించారు. ఆగస్టు 15వ తేదీ వరకు 31వేల కోట్లు మాఫీ చేస్తానని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిండని.. 9వేల కోట్లు కోత పెట్టిండని అన్నారు. అయినప్పటికీ ప్రజలు నమ్మడం లేదని ప్రతి ఊరి దేవుడి మీద ప్రమాణాలు చేసిండని ఎద్దేవా చేశారు.

సోనియా మీద ఒట్టు పెట్టినా, దేవుళ్ల మీద ఒట్టు పెట్టినా అబద్ధమే నా లక్షణం. మోసమే నా విధానం. మాట తప్పడమే నా నైజం అనే విధంగా తన నిజస్వరూపాన్ని రేవంత్ రెడ్డి బట్టబయలు చేసుకున్నారని హరీశ్‌రావు విమర్శించారు. తమ హయాంలో మొదటి దఫాలో రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తేనే 35లక్షల మంది రైతులకు దాదాపు 17వేల కోట్లు అయ్యిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా రెండు లక్షల రుణమాఫీ చేస్తే 22 లక్షల మంది రైతులు ఉంటారా? రూ.17,869 కోట్లు మాత్రమే అవుతుందా? అని ప్రశ్నించారు. ఈ ఒక్క విషయంతోనే రుణమాఫీ పచ్చి అబద్ధమని తేలిపోతుందని విమర్శించారు. మీరు దగా చేశారన్నది స్పష్టంగా తేలిపోయిన తర్వాత రాజీనామా ఎవరు చేయాలని ప్రశ్నించారు. ఏటిలో దుంకి ఎవరు చావాలని నిలదీశారు. నోటికి వచ్చినట్టు దిగజారుడు భాషలో బీఆర్ఎస్‌ను తిడితేనో, తెచ్చిపెట్టుకున్న ఆవేశంతో రంకెలు వేస్తేనో అబద్ధాలు నిజాలైపోవని మండిపడ్డారు.

రేవంత్ రెడ్డి రైతు ద్రోహానికి మాత్రమే కాదు.. దైవ ద్రోహానికి పాల్పడ్డావని హరీశ్‌రావు మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండి దేవుళ్ల మీద ఒట్టు పెట్టి మాట తప్పిన నువ్వు.. చేసిన అపచారానికి వెంటనే ప్రాయశ్చిత్తం చేసుకోవాలని హితవు పలికారు. రేవంత్ రెడ్డికి సంస్కారం లేదని.. ఆయనలో ఉన్నది వికారమే తప్ప సంస్కారమే కాదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి మాట తప్పినందుకు ఆ దేవుళ్లు తెలంగాణ మీద ఎక్కడ ఆగ్రహిస్తారో.. రేవంత్ చేసిన పాప ఫలితం ప్రజలకు ఎక్కడ శాపంగా మారుతుందో అని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చేసిన తప్పునకు, దైవ ద్రోహానికి తెలంగాణ మీద ఆగ్రహించవద్దని ముక్కోటి దేవుళ్లను ప్రార్థించారు. ఆయన ఏ దేవుళ్ల మీద ఒట్టు పెట్టి మాట తప్పిండో ఆ దేవుళ్లందరి దగ్గరికీ త్వరలో తానే స్వయంగా వెళ్తానని చెప్పారు. రేవంత్ రెడ్డి చేసిన తప్పు తెలంగాణ ప్రజలకు ముప్పుగా మారొద్దని ఆ దేవుళ్లను ప్రార్థించి వస్తానని పేర్కొన్నారు.

# అల్లం వెల్లుల్లి, కుట్లు అల్లికలే కాదు.. బ్రేక్ డ్యాన్సులు చేసుకోండి:



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంపై మంత్రి సీతక్క, మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య మాటల యుద్ధం సాగింది. మహిళలతోపాటు అన్నివర్గాలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో, కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. మహిళలకు ఉచితబస్సుల ప్రయాణంపై కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బస్సుల్లో అల్లం వెల్లుల్లి, కుట్లు అల్లికలు చేసుకుంటే తప్పేంటన్న మంత్రి సీతక్క వ్యాఖ్యలపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. బస్సుల్లో అల్లం వెల్లుల్లి, కుట్లు అల్లికలు తాము వద్దనట్లేదన్నారు కేటీఆర్. బస్సుల్లో కుట్లు అల్లికలే కాదు, అవసరమైతే బ్రేకు డ్యాన్సులు వేసుకోవచ్చని కేటీఆర్ అన్నారు. బస్సుల్లో సీట్లకోసం మహిళలు కొట్టుకుంటున్నారని, డ్రైవర్లు కండక్టర్లకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బస్సులు ఎక్కువ పెట్టండి, అవసరమైతే ఒక్కొక్కరికి ఒక్కో బస్సు పెట్టండంటూ కాంగ్రెస్ ప్రభుత్వంనుద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యనించారు.

మరోవైపు, మంత్రి సీతక్క.. కేటీఆర్ వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు బ్రేక్ డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు చేసుకోవచ్చంటూ కేటీఆర్ జుగుప్సకరంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ తండ్రి ఆయనకు నేర్పిన సంస్కారం ఇదేనా? అంటూ ప్రశ్నించారు మంత్రి సీతక్క. కేటీఆర్‌కు మహిళలంటే గౌరవం లేదన్నారు. మహిళల పట్ల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని మంత్రి సీతక్క అన్నారు. వెంటనే తెలంగాణ మహిళా లోకానికి కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని సీతక్క డిమాండ్ చేశారు. మరోవైపు, కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఇతర కాంగ్రెస్ నేతలు కూడా మండిపడుతున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తమ ప్రభుత్వం అందిస్తుంటే.. బీఆర్ఎస్ ఓర్వలేకపోతోందంటూ మండిపడుతున్నారు.

# బాచుపల్లిలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాలపై ఐపిఎస్ అధికారి ఎవి రంగనాథ్ సారథ్యంలోని హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) కొరడా ఝులిపిస్తోంది. తాజాగా నేడు తన పంజాను బాచుపల్లిపై విసిరింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలలో బాచుపల్లి ఎర్రకుంట పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాలను నేలమట్టం చేస్తున్నారు. ఉదయం నుంచి కూల్చివేతలు కొనసాగుతున్నాయి.

కాగా, నగరంలో ఆక్రమణలకు సంబంధించి ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో హైడ్రాకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ క్రమంలో నగర శివారులో చెరువులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన కబ్జాదారులపై హైడ్రా అధికారులు దృష్టి సారించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం, దేవందర్‌నగర్‌లలో హైడ్రా ఆధ్వర్యంలో గతవారం అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన సంగతి తెలిసిందే. 329, 342 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూముల్లో వెలిసిన సుమారు 51 అక్రమ నిర్మాణాలను తొలగించారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే, చెరువు కబ్జాలకు పాల్పడితే ఊరుకోమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వార్నింగ్ ఇచ్చారు.

ఇక అమీన్ పూర్ , బీరంగూడ చెరువుల కబ్జాలపై ఆయన దృష్టి సారించారు.. ఇప్పటికే అమీన్ పూర్ లో క్షేత్ర స్థాయిలో పర్యటించిన ఆయన చెరువు ఆక్రమణదారుల భరతం పట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వారంలో గాని, పై వారంలోగాని ఈ ప్రాంతంలోని అక్రమణలు తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

# తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవేదికపై చాటాలి

(మొదటి పేజీ తరువాయి)

విప్లవం తెచ్చారు. కాంగ్రెస్ దేశానికి చేసిన సేవలకు ఇవి కొన్ని ఉదాహరణలే. 2004లో తెలంగాణ ఇస్తామని సోనియా గాంధీ కరీంనగర్‌లో మాటిచ్చారు' అన్డి తెలిపారు.





అమెరికా పర్యటనలో ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడితో సమావేశం అయ్యానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశం సానుకూలంగా జరిగిందని, తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చేందుకు వరల్డ్ బ్యాంక్ అంగీకరించినట్లు చెప్పారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండు ఇప్పటికే అమలు చేశామని అన్నారు. ఆరోగ్య శ్రీ పథకానికి పూర్వ వైభవం తెచ్చామని వివరించారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు.

ఈ ఏడాదే ఫసల్‌బీమాలో చేరాలని నిర్ణయం : 'వరంగల్ డిక్లరేషన్ అమల్లో భాగంగా రుణమాఫీ చేస్తున్నాము. రుణమాఫీ అసాధ్యమని కొందరు వక్రభాష్యం చెప్పారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి చూపిస్తున్నాం. రుణమాఫీపై విపక్షాలు రంధ్రాన్వేషణ చేస్తున్నాయి. సాంకేతిక కారణాలతో కొందరికి రుణమాఫీ అందట్లేదు. అలాంటి వారిని గుర్తించి రుణమాఫీ అమలు చేస్తాం. కలెక్టరేట్‌లో కౌంటర్లు ఏర్పాటు చేసి రుణమాఫీ సమస్యలు పరిష్కరిస్తాం. రుణమాఫీ అమలుతో తమ జన్మధన్యమైందని భావిస్తున్నాము. అర్హులైన అందరికీ రైతు భరోసా అందిస్తాం. గత ప్రభుత్వం అనర్హులకు రైతు బంధు ఇచ్చింది. త్వరలో రైతుభరోసా పథకాన్ని ప్రారంభించ బోతున్నాము. ఈ ఏడాది నుంచి ఫసల్‌బీమాలో చేరాలని నిర్ణయించాం.' అని రేవంత్ తెలిపారు.

సన్నరకం వరి సాగును ప్రోత్సహించేందుకు రూ.500 బోనస్ చెల్లిస్తామని అన్నారు. రూ.500 బోనస్‌కు 33 రకాల వరిధాన్యాలను గుర్తించామని పేర్కొన్నారు. పెండింగ్ ధరణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారానికి సమగ్ర చట్టం తీసుకురావాలని భావిస్తున్నామని వివరించారు. డ్రగ్స్? మాట వినపడకూడదని, కనపడకూడదని కఠిన నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, నివారణకు జీరో టాలరెన్స్? పద్ధతిని అనుసరిస్తున్నామన్నారు. టీ-న్యాబ్?ను బలోపేతం చేశామని చెప్పారు. సైబర్ మోసాలు, నేరాలు బారినపడిన వారికి 1930 నంబరు ఏర్పాటు చేశామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# హైదరాబాద్‌లో దంచి కొట్టిన వాన



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ నగరంలో గురువారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నేటి సాయంత్రం నుంచి నగరంలోని చాలా ప్రాంతాల్లో భారీ వర్షం దంచికొట్టింది. దీంతో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ క్రమంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు చోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. సాయంత్రంపూట బయటకు వచ్చిన ప్రజలు, విధులు ముగించుకుని ఇళ్లకు చేరుకుంటున్న ఉద్యోగులు భారీ వర్షంతో ఇబ్బందులు పడ్డారు. చంద్రబాబుకు రేవంత్ రెడ్డి అదిరిపోయే షాక్!! హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్ నగర్, లింగంపల్లి, తెల్లాపూర్, యూసుఫ్‌గూడ,పంజాగుట్ట్, అమీర్‌పేట్, ఖైరతాబాద్, లక్డీకపూల్, ఎర్రగడ్డ, కూకట్ పల్లి, బోయిన్ పల్లి, అల్వాల్, సికింద్రాబాద్, పటాన్ చెరు, ఆర్సీపురం, అమీన్‌పూర్, హైటెక్ సిటీ తదితర ప్రాంతాల్లో భా వర్షం కురిసింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు కుండపోత వర్షం కురిసింది.



మరో రెండు గంటలపాటు వర్షం కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. భారీ వర్షాలతో రోడ్లు లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. మ్యాన్ హోల్స్ దగ్గర నీళ్లు వెళ్లేందుకు అడ్డంకులు తొలగిస్తున్నారు. అత్యవసరమైతేనే బయటకు రావాలని నగర ప్రజలకు జీహెచ్‌ఎంసీ అధికారులు హెచ్చరించారు. దైనా అనుకోని విపత్తు ఏర్పడితే వెంటనే 040-21111111, 9000113667 నెంబర్లకు ఫోన్ చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. మరోవైపు, హైదరాబాద్ నగరంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాలకు భారత వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాత్రి కూడా వర్షం కొనసాగే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరోవైపు, సంగారెడ్డి జిల్లాలోనూ భారీ వర్షం కురిసింది. గుమ్మడిదలలో 9.1 సెం.మీ వర్షపాతం నమోదైంది. సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాకు కూడా వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.



## వర్షాలు పడుతున్నాయ్.. వరల్డ్ కప్ నిర్వహించలేం



- బీసీసీఐ సెక్రటరీ జై షా

**బలగం టీవి, న్యూఢిల్లీ**

మహిళల టీ20 వరల్డ్ కప్ నిర్వహణపై అనిశ్చితి నెలకొంది. అక్టోబర్ నెలలో జరగాల్సిన ఈ మెగా టోర్నీకి బంగ్లాదేశ్ ఆతిథ్యమివ్వాలి. కానీ, కొన్ని రోజులుగా ఆందోళనలతో అట్టుడుకుతున్న బంగ్లాలో పరిస్థితులు చక్కబడలేదు. దాంతో ఐసీసీ వరల్డ్ కప్ వేదికను తరలించే ప్రయత్నాల్లో ఉంది. ఆ ప్రక్రియలో భాగంగానే బీసీసీఐని ఐసీసీ సంప్రదించింది. అయితే.. భారత క్రికెట్ నియంత్రణ మండలి మాత్రం ఆసక్తి చూపడం లేదు. 'ఇప్పుడు మన దగ్గర వర్షాలు బాగా పడుతున్నాయి. అంతకంటే ముఖ్యమైన విషయం.. వచ్చే ఏడాది మహిళల వన్డే వరల్డ్ కప్ నిర్వహించబోతున్నాం. ఈ పరిస్థితుల్లో మహిళల టీ20 ప్రపంచ కప్ టోర్నీకి ఆతిథ్యం ఇస్తామని చెప్పలేను. ఒకవేళ అంగీకరించామంటే.. వరసగా రెండు వరల్డ్ కప్‌లను నిర్వహించాల్సి ఉంటుంది' అని సెక్రటరీ జై షా ఐసీసీకి స్పష్టం చేశాడు. దాంతోఐసీసీ మళ్లీ వేదిక వేట మొదలెట్టనుంది. ఏదేశం ముందుకురాని పరిస్థితుల్లో ఈసారి మహిళల టీ20 వరల్డ్ కప్‌ను యూఏఈలో.. దుబాయ్‌లో టోర్నీని నిర్వహించే అవకాశముంది.

## దులీప్ ట్రోఫీలో పాల్గొనే జట్లు ఇవే...

- రోహిత్‌లు, కోహ్లీ దూరం
- అనంతపురంలో మ్యాచ్‌లు



**బలగం టీవి, న్యూఢిల్లీ**

ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీ 2024 తొలి రౌండ్‌లో పాల్గొనే జట్లను భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ప్రకటించింది. సాధారణంగా దులిప్ ట్రోఫీ ఈస్ట్, సౌత్, నార్త్, ఈస్ట్, వెస్ట్, సెంట్రల్, నార్త్ ఈస్ట్ జోన్స్ జట్ల మధ్య జరుగుతుంది. కానీ ఈ సారి ఇంటర్నేషనల్ స్టార్, దేశవాళీ స్టార్లను కలిపి ఈ టోర్నీ నిర్వహిస్తున్నారు. అలాగే భారత్ టెస్టు జట్టుకు అత్యుత్తమ టీమ్‌ను ఎంపిక చేయడంపై భారత సెలెక్టర్లు ఫోకస్ పెట్టారు. ఈ క్రమంలోనే దులీప్ ట్రోఫీ ఫార్మాట్‌ను మార్చారు. ఈ టోర్నీకి విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కూడా అందుబాటులో ఉంటారని ప్రచారం జరిగినా.. వారికి రెస్ట్ ఇచ్చారు. శుభ్‌మన్ గిల్, అభిమన్యు ఈశ్వరన్, రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్‌లు నాలుగు జట్లకు సారథులుగా వ్యవహరించనున్నారు. ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చే ఆటగాళ్లకు భారత జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది.

తెలుగు రాష్ట్రాల నుంచి తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, రికీ భుయ్‌లకు ఈ టోర్నీలో ఆడే అవకాశం దక్కింది. నితీష్ కుమార్ రెడ్డి పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తేనే అతనికి మ్యాచ్ ఆడే అవకాశం దక్కనుంది. బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్‌కు ఎంపికయ్యే ఆటగాళ్లు.. ఈ టోర్నీ చివరి దశలో దూరమవుతారు. సెప్టెంబర్ 5 నుంచి ఈ టోర్నీ ప్రారంభం కానుంది.

ద్రులీప్ ట్రోఫీ అనంతపురం వేదికగా ప్రారంభం కానుంది. ఈ టోర్నీతోనే భారత దేశవాళీ క్రికెట్ సీజన్‌కు తెరలేవనుంది. సెప్టెంబర్ 5 నుంచి అనంతపురం, బెంగళూరులో దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లు జరగనున్నాయి. అనంతపూరంలోని రూరల్ డెవలెప్‌మెంట్ ట్రస్ట్ స్టేడియం, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) ఏడీసీఏ స్టేడియం.. దులీప్ ట్రోఫీకి ఆతిథ్యం ఇవ్వనున్నాయి. టీమ్-ఏ, బీ మధ్య జరిగే తొలి మ్యాచ్ ఒక్కటే బెంగళూరు వేదికగా జరగనుండగా.. మిగతా 5 మ్యాచ్‌లు అనంతపూరం వేదికగానే జరగనున్నాయి. సెప్టెంబర్ 5 నుంచి 8 వరకు టీమ్ సీ, టీమ్ డీ మధ్య అనంతపురం వేదికగానే రెండో మ్యాచ్ జరగనుంది.

**అందుకే వారు ఆడడం లేదు : జైషా**

విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ.. దేశవాళీ క్రికెట్ ఆడకపోవడానికి గల కారణాన్ని జై షా వెల్లడించాడు. అప్ కమింగ్ సిరీస్‌లను దృష్టిలో పెట్టుకొనే కోహ్లీ, రోహిత్‌లతో పాటు మరికొంత మంది సీనియర్ ఆటగాళ్లకు దేశవాళీ క్రికెట్ నుంచి మినహాయింపు ఇచ్చామని తెలిపాడు.

'రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ ఆటగాళ్లను దులీప్ ట్రోఫీ ఆడాలని ఆదేశించలేం. వారికి గాయాలయ్యే ప్రమాదం ఉంటుంది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ దేశాల్లో ఏ అంతర్జాతీయ క్రికెటర్ కూడా దేశవాళీ క్రికెట్ ఆడడు. మేం ఆటగాళ్లను గౌరవంగా చూడాలి.'అని జై షా ఓ స్పోర్ట్స్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపాడు. టెస్ట్ క్రికెట్ కోసం ప్రత్యేకమైన ఫండ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు కూడా జై షా తెలిపాడు. పింక్ బాల్ టెస్ట్‌ల పట్ల బీసీసీఐ సుముఖంగా లేదన్నాడు. పింక్ బాల్ టెస్ట్‌లు 2-3 రోజుల్లోనే ముగుస్తాయని, ఫ్యాన్స్ ఐదు రోజుల కోసం టికెట్లు కొంటారని తెలిపాడు. పింక్ బాల్స్ కారణంగా ప్రేక్షకులు, బ్రాడ్‌కాస్టర్స్ తీవ్రంగా నష్టపోతారని చెప్పారు.

ఒలింపిక్స్ క్రీడాకారుల కోసం కొత్త ఎన్‌సీఏను సిద్ధం చేశామని కూడా జై షా వెల్లడించాడు. కొత్త ఎన్‌సీఏలో 3 మైదానాలు, 100 పిచ్‌లు, 45 ఇండోర్ టర్ఫ్ నిర్మించామని తెలిపాడు. ఇందులో నాన్ క్రికెటర్స్, ఒలింపిక్ అథ్లెట్లు కూడా శిక్షణ తీసుకోవచ్చన్నారు.

**టీమ్ ఏ: శుభ్‌మన్ గిల్(కెప్టెన్), మయాంక్ అగర్వాల్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, కేఎల్ రాహుల్, తిలక్ వర్మ, శివమ్ దూబే, తనుష్ కోటియన్, కుల్దీప్ యాదవ్, ఆకాశ్ దీప్, ప్రసిధ్ కృష్ణ, ఖలీల్ అహ్మద్, ఆవేష్ ఖాన్, విద్వత్ కావేరప్ప, కుమార్ కుశాగ్ర, శస్వాత్ రావత్.**

**టీమ్ బీ: అభిమన్యు ఈశ్వరన్(కెప్టెన్), యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్, ముషీర్ ఖాన్, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, మహమ్మద్ సిరాజ్, యశ్ దయాల్, ముఖేష్ కుమార్, రాహుల్ చాహర్, ఆర్ సాయి కిషోర్, మోహిత్ అవాస్థి, ఎన్ జగదీషన్(కీపర్).**

**టీమ్ సీ: రుతురాజ్ గైక్వాడ్(కెప్టెన్), సాయి సుదర్శన్, రజత్ పటీదార్, రజత్ పటీదార్, అభిషేక్ ఫోరల్(కీపర్), సూర్యకుమార్ యాదవ్, బీ ఇంద్రజిత్, హృతిక్ షోకీన్, మనవ్ సుథార్, ఉమ్రాన్ మాలిక్, వైశాఖ్ విజయ్‌కుమార్, అన్షుల్ కంబోజ్, హిమాన్ష చౌహన్, మయాంక్ మార్కండే, ఆర్యన్ జుయాల్, సందీప్ వారియర్.**

**టీమ్ డీ: శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), అథర్వ టైడ్, యశ్ దుబే, దేవదత్ పడిక్కల్, ఇషాన్ కిషన్, రికీ భుయ్, సరాన్ష్ జైన్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, ఆదిత్య థాక్రే, హర్షిత్ రాణా, తుషార్ దేశ్‌పాండే, ఆకాశ్ సెంగుప్తా, కేఎస్ భరత్, సౌరభ్ కుమార్.**

## ఒలింపిక్స్ పతక విజేతలతో ప్రధాని భేటీ..



**బలగం టీవి, న్యూఢిల్లీ**

పారిస్ ఒలింపిక్స్ పతక విజేతలతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గురువారం భేటీ అయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం మోదీ తన నివాసంలో క్రీడాకారులను కలిశారు. ఈ సందర్భంగా వారిని అభినందించి ఘనంగా సన్మానించారు.

గురువారం ఢిల్లీలోని ఎర్రకోటపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి షూటర్ మను భాకర్, సరబ్జోత్ సింగ్, పురుషుల హాకీ జట్టు సహా ఒలింపిక్స్ పతక విజేతలు హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం వారంతా నేరుగా ప్రధాన మంత్రి అధికారిక నివాసానికి వెళ్లారు. అక్కడ మోడీతో భేటీ అయ్యారు. ఈ భేటీ సందర్భంగా భారత పురుషుల హాకీ జట్టు ప్రధానికి ప్రత్యేక బహుమతి అందజేసింది. ఆటగాళ్లంతా సంతకం చేసిన జెర్సీని గుర్తుగా అందజేసింది. అంతకుముందు ప్రధాని స్పీచ్‌లో ఒలింపిక్స్ గురించి ప్రస్తావించారు. ఒలింపిక్స్ నిర్వహణపై మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. అంతే కాకుండా క్రీడా సంబరానికి ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. ఇక ఈ విశ్వక్రీడల్లో పోటీ పడిన అథ్లెట్లకు ధైర్యం చెబుతూనే, పారాఒలింపిక్స్‌కు వెళ్లే అథ్లెట్లకు మోడీ శుభాకాంక్షలు తెలిపారు

కాగా, ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్ 2024లో భారత్ మొత్తం ఆరు పతకాలు సాధించిన విషయం తెలిసిందే. భారత బృందం ఒక రజతం, ఐదు కాంస్య పతకాలు సాధించింది. పతకాల పట్టికలో మన దేశం 71వ స్థానంలో నిలిచింది.

## వినాయక చవితి కానుకగా 'భలే ఉన్నాడే!'

**బలగం టీవి, హైదరాబాద్**

రాజ్‌తరుణ్ కథానాయకుడిగా జె.శివసాయివర్ధన్ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'భలే ఉన్నాడే!'. ఈ సినిమాలో మనీషా కంద్కూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. మారుతి టీమ్ ప్రొడక్ట్ సంస్థ సమర్పిస్తోంది. ఎన్వీ కిరణ్ కుమార్ నిర్మాత.ఇప్పటికే ఈ మూవీ ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ విడుదల చేసిన చిత్రబృందం తాజాగా విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమాను వినాయక చవితి కానుకగా సెప్టెంబర్ 7న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. 'పురుషోత్తముడు', తిరగబడరాసామి వచ్చి రెండు నెలలు కూడా అవ్వట్లేదు అంతలోనే మరో సినిమాను విడుదలకు రెడీ చేశాడు రాజ్ తరుణ్. ఈ చిత్రంలో రాజ్ తరుణ్ టైలర్ పాత్రలో నటిస్తుండగా.. సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు.






## కాలినడకన తిరుమలకు మహేశ్ బాబు కుటుంబ సభ్యులు

**బలగం టీవి, తిరుమల**

సూపర్ స్టార్ మహేశ్ బాబు కుటుంబ సభ్యులు శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు వెళ్లారు. మహేశ్ బాబు భార్య నమ్రతా శిరోద్కర్, కుమారుడు గౌతమ్, కుమార్తె సితార అలిపిరి నుంచి నడక మార్గంలో తిరుమల పైకి చేరుకున్నారు. గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కాలినడక మార్గంలో మహేశ్ బాబు కుటుంబ సభ్యులు కనిపించడంతో వారితో ఫొటోలు దిగేందుకు భక్తులు పోటీ పడ్డారు. మహేశ్ బాబు ఫ్యామిలితో కలిసి కాలినడకన తిరుపతికి చేరుకున్నందుకు సంతోషంగా ఉందని భక్తులు తెలిపారు.




## ఇండిపెండెన్స్ డే సెలబ్రిటీల విషెస్

- 'కల్కి' స్పెషల్ పోస్టర్

**బలగం టీవి, హైదరాబాద్**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సెలబ్రిటీలు దేశ ప్రజలకు శుభాకాంక్షలు చెబుతున్నారు. సోషల్ మీడియా వేదికగా మెగాస్టార్ చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్, హనుమాన్ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ట్విట్టర్‌లో పోస్టలు షేర్ చేశారు. ఇక ప్రభాస్ రీసెంట్ బ్లాక్ బస్టర్ మూవీ 'కల్కి' మూవీ టీమ్ కూడా ఇండిపెండెన్స్ డే విషెస్ తెలిపింది.




**దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. దీని కోసం మన పూర్వీకులు ఎంతోమంది ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశారు. వాళ్లందరినీ స్మరించుకుందాం. వారిని ఆదర్శంగా తీసుకుందాం. జైహింద్- చిరంజీవి**

**అందరికీ 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు- జూనియర్ ఎన్టీఆర్**

**ఈ ప్రపంచంలో ఉన్న భారతీయులందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు- అల్లు అర్జున్**

కల్కి స్పెషల్ పోస్టర్

రెబల్ స్టార్ ప్రభాస్- నాగ్ అశ్విన్ కాంబోలో తెరకెక్కిన 'కల్కి ఏడీ 2898' గురువారానికి దిగ్విజయంగా 50 రోజులు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆడియెన్స్‌కు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ ఓ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. సినిమాను బ్లాక్‌బస్టర్ చేసినందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు.